హాస్య కథ

# పెద్దమ్మ ఋణం

## - ఆర్.వి. చలపతి

ఊరంతా నిద్ర లేచినా నిరంజన్ లేవలేదు. నిద్రలేచాడు గానీ మంచంమీది నుండి లేవలేదు. లేవమని గోల పెట్టడానికి భార్య యింట్లోలేదు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్ళింది అది ధైర్యం! ఆఫీసు పదిగంటలకు. ఇప్పటి నుండీ లేచి యేం చేయాలి గనుక!

నిరంజన్ దృష్టిలో తెల్లగా తెలవారాక కూడా దుప్పటి కప్పుకుని, ఎడుకోవడంలో వున్న సుఖం యెందులో నూ లేదు.

ఆ సమయంలో కాలింగ్ బెల్ మ్రోగడం పెద్ద చిరాకనిపించింది. కానీ తప్పదుగా.

లేచి తలుపు తీశాడు! టెలిగ్రాం మెసెంజర్!!

'ఉదయాన్నే యీ టెలిగ్రాం యేమిటీ' అనుకుంటూ సంతకం చేసి కాగితం తీసుకుని, విప్పదీసి చూశాడు.

'భాగ్యమ్మ సీరియస్. స్టార్ట్' – రాఘవ.

నిరంజన్ గొల్లున యేడవ బోయి ఆగాడు.

'అసలు యెవరీ భాగ్యమ్మ?' అని సందేహం వచ్చింది 'టెలిగ్రాం తనకేనా యింతకూ?' అనుకుని అడ్రసు చూశాడు. ఒక్క అక్షరమూ తప్పకుండా తనపేరూ, అడ్రసూ అంతా వుంది

'ఎవరో భాగ్యమ్మ సీరియస్ అయితే తన కెందుకు టెలిగ్రాం యివ్వాలి? యీ రాఘవగాడు?'

అదిసరే? మరో సందేహం ఈ రాఘవ యెవరు?'

తనకు తెలిసి తన తల్లి, తండ్రుల వైపు బంధువులెవరూ భాగ్యమ్మ పేరు కలిగినవారు లేరు. ఒకవేళ తన భార్య వైపు...? కావచ్చును. దగ్గరి చుట్టమో, దూరపు చుట్టమో కూడా తెలియదు. వెళ్ళకుండా వుందామన్నా భయంగానే వుంది. భార్య వైపు చుట్టమై వుంటే, భార్య వూరి నుండి వచ్చాక తప్పకుండా గోల పెడుతుంది. 'మా బంధువులంటే మీ కెప్పుడూ చిన్న చూపే' అని యెత్తి పొడిచి, సాధించి, సమయం వచ్చినప్పుడు బదులుకు బదులు తీర్చుకోక మానదు.

'దగ్గరి గ్రామమే కనుక ఒకసారి వెళ్ళి చూచి వస్తే పోయేదేమిలేదు. చూచివద్దాం పోనీ!' అనుకున్నాడు నిరంజన్.

వెంటనే ఆఫీసుకు సెలవు చీటీ రాసి తమ వీధిలోనే వున్న తన స్నేహితునికిచ్చి వచ్చాడు.

★ ★ ★ ★ ★

అది బాగా చిన్నగ్రామం భాగ్యమ్మ యిల్లు కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు! అయితే అసలు కష్టం యేమిటంటే నిరంజన్ వెళ్ళేటప్పటికి భాగ్యమ్మ వెళ్ళిపోయింది పైలోకాలకు!

అక్కడ తన తల్లివైపు బంధువులు ఒకరిద్దరు కనిపించడంతో నిరంజన్ సందేహం తీరిపోయింది! భాగ్యమ్మ తన తల్లివైపు బంధువన్నమాట! వాళ్ళతో, వీళ్ళతో మాట్లాడిన మాటలలో తెలిసింది ఆమె తన తల్లికి అక్క వరస అవుతుందని

అక్కడ చేరిన అందరూ నొచ్చుకున్నారు నిరంజన్ ఆవిడ బ్రతికుండగా రానందుకు.


"కళ్ళు మూసేదాకా నీకోసం కలవరిస్తూనే వుంది. పాపం!" అన్నాడొకాయన

భాగ్యమ్మకు చెప్పుకోదగ్గ ఆత్మీయులెవరూ లేరుట! ఆస్తి వుంది. అనుభవించేవాళ్ళు లేరు. సంతానమూ లేదు కనుక. అయినా డబ్బు విషయంలో మహాలోభి -అందరికీ వడ్డీకి అప్పులిస్తూ, ఖచ్చితంగా వసూలు చేసుకునేది. ఆ డబ్బంతా బ్యాంకుల్లో మూలగడమే తప్ప, పైసా ఖర్చు పెట్టేది కాదు చివరి రోజులలో ఆమె యించుమించు తాను అప్పులిచ్చిన అందరి దగ్గరా వసూలు చేసేసింది. ఇవీ భాగ్యమ్మ గురించి నిరంజన్ తెలుసుకున్న వివరాలు.


తనకు వారసు లంటూ లేరు గనుక, వరుసకు చెల్లెలు కొడుకైన నిరంజన్‌కు తన ఆస్తినంతా యిచ్చి పోవాలని ఆమె కోరిక. చివరి క్షణం దాకా 'వనజమ్మ కొడుకు నిరంజన్' అని కలవరిస్తూనే వుంది. ఆమె బ్రతికుండగానే నిరంజన్ వచ్చి వుంటే తన చేతి మీదుగా అతనికి అంతా అప్పజెప్పి నిశ్చింతగా చనిపోయి వుండేదిటపాపం!'

ఇదీ అక్కడ చేరిన కొందరు అన్నమాటలు

ఇంచుమించు అందరూ దీన్ని సమర్థించారు. నిరంజన్ కన్నా దగ్గర బంధువెవరూ ఆమెకు లేరు కనుక అది నిజమే అయివుంటుందన్నారు



కొందరయితే భాగ్యమ్మకు అటువంటి అభిప్రాయమే వుండేదని తమ చెవులతో



విన్నంత నమ్మకంగా చెప్పారు. 'ఈ పాటికి ,దానికి కావలసిన యేర్పాట్లు చేసి పెట్టి వుంటుందనీ, నిరంజన్ అదృష్ట వంతుడనీ' అన్నారు

భాగ్యమ్మ వ్యవహారాలన్నీ చూచిపెట్టడానికి ఆ వూర్లోనే వరదయ్య అని ఒకాయన వున్నాడు. అతను సమయానికి వూర్లో లేడు. అతను యేవూరికి వెళ్ళాడో అతని యింట్లోవాళ్ళు కూడా చెప్పలేక పోయారు. అందువలన అతనికి భాగ్యమ్మ మరణం గురించి కూడా తెలుపలేక పోయారెవరూ. ఇవాళో, రేపో అతను వచ్చేస్తాడు. రాగానే అన్ని వివరాలు తెలిసిపోతాయి.

తనకు యింత ఆస్తిని కట్టబెట్టాలని కంకణం కట్టుకున్న భాగ్యమ్మ మీద నిరంజన్‌కు 'అర్జెంటు'గా కొండంత అభిమానం పుట్టుకొచ్చింది.

"పెద్దమ్మా! ఇంకోరోజు ఆగలేక పోయావా! నేను వచ్చేసరికి వెళ్ళిపోయావే!ఏమిటంత అర్జెంటు పనులు నీకు పైలోకంలో?" అని భోరున యేడ్చినట్టు యేడ్చాడు. చుట్టూ వున్న వాళ్ళు అతడిని ఓదార్చినట్టే ఓదార్చారు.

"ఇలా యెవరికి వారు యేడుస్తూ కూర్చుంటే పనులెలా అవు తాయి? కావలసిన కార్యం చూడండి". అని సలహా యిచ్చాడొకాయన.

## హాస్య కథ

"ఆవిడకు కావలసిన వాడు వచ్చేశాడు కదా! అతనే చూస్తాడన్నీ". అని తప్పుకున్నారు అందరూ.

నిరంజన్ పళ్ళు నూరుకుని, తన మెడలో గొలుసును అమ్మి, ఆ డబ్బుతో అన్ని పనులూ కానిచ్చాడు. పనిలో పనిగా భార్య పుట్టింటికి టెలిగ్రాం యిచ్చాడు. 'వెంటనే బయలుదేరి రమ్మ'నీ, 'వచ్చేటప్పుడు మామగారిదగ్గర వెయ్యి రూపాయలు పట్టుకురమ్మ'నీ కూడా!

ఆ విధంగా భాగ్యమ్మ శవం ఘనంగా కాటికి బయలు దేరింది

"ఎంత అభిమానం యితనికి తన పెద్దమ్మంటే!" అని ఆశ్చర్య పోయారు కొందరు.

"రాగానే అసలు యీావిడ నాకేమవుతుందని అడిగిన వాడు ఆస్తి వస్తుందని తెలిశాక యెంత అభిమానం కురిపిస్తున్నాడు!" అంటూ వేళాకోళం చేశారు కొందరు.

ఎవరేమనుకున్నా నిరంజన్ నిజంగా బాధపడ్డాడు. భాగ్యమ్మ చనిపోయినందుకు కాదు. ఆవిడ బ్రతికుండగా తాను వచ్చి వ్యవహారం "సెటిల్" చేసుకునే అవకాశం లేకపోయినందుకూ, అసలు యిలాంటి పెద్దమ్మలు అంటూ వొకరు వున్నట్టు చనిపోయిన తన తల్లి తనతో యెప్పుడూ మాట వరుసకైనా చెప్పనందుకూ.

పది రోజులూ గడిచాయి.

దినం కూడా యేలోటూ లేకుండా, అందరూ ముక్కుపై వ్రేలుంచుకునేలా వైభవంగా చేశాడు నిరంజన్. వచ్చిన జనాలందరూ వెళ్ళిపోయారు.

అంత పెద్ద యింట్లో నిరంజన్, భార్య, పిల్లలతో బిక్కు బిక్కు మంటూ వున్నాడు./

తరువాత రెండురోజులకు దిగాడు వూర్లోకి వరదయ్య. రాగానే భాగ్యమ్మ చనిపోయినందుకు విచారించాడు నిరంజన్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

"నిరంజన్ బాబూ! మీ కోసం భాగ్యమ్మ చివరిరోజులలో చాలసార్లు కలవరించింది. కానీ మీ అడ్రసు తెలియక నేను యేమి చేయలేకపోయాను. చివరికి నేను వూర్లో లేని సమయంలో యెవరి ద్వారా మీ అడ్రసు కనుక్కుందో, పాపం! మీకు టెలిగ్రాం యిప్పించినట్టుంది కానీ మీరు వచ్చే దాకా ప్రాణాలతో వుండలేక పోయింది".

నిరంజన్ విచారంగా మొహం పెట్టాడు.

"వరదయ్యగారూ! మా అమ్మకూడా పెద్దమ్మ గురించి చాలసార్లు చెప్పింది ఎప్పటికప్పుడు పెద్దమ్మను చూడ్డానికి రావాలనే అనుకునేవాడిని. కానీ వుద్యోగం గొడవలు, సంసారం గొడవలు నన్ను యెక్కడికీ కదలనీయలేదు. లేకుంటే యీ వయసుపై బడ్డ కాలంలో పెద్దమ్మను యిలా వొంటరిగా వుండనిచ్చే వాడినేకాను" అని కోశాడు నిరంజన్.

"నిజమే. మనం మన స్వంత వ్యవహారాలలో తలమునకలవుతున్నప్పుడు మనకు చాల కావలసిన వాళ్ళు కూడా గుర్తుండరు కానీ అవతలి

## యువతా కవితా!

### వారసత్వం

అరక్షణం క్రితం
నీ అంతరంగాన్ని
విచ్ఛిన్నం చేసిన
వాగ్బాణాన్ని
అదను చూసి
ఎదుటి మనసుకి
ఎక్కుపెడుతున్నావ్!
యిది
వానర వారసత్వమా!
కాదు కాదు
అసురుల అంశమే!

—వడ్డమూడి దుర్గాంబ

### ఏడు(పు)

పుట్టుకతో నే
శిశువు ఏడుస్తుంది
పోయిన వాణ్ణి చూసి
ఉన్నవాడు ఏడుస్తాడు
ఏడు . ఏడు ఏడు
అంటూ
మనం ఏడవాల్సిందే
కానీ..
ఆ ఏడు(పు) మాత్రం

తొణకదు బెణకదు

—పెండేకంటి ఆంజనేయులు

### స్నేహం...

ఒక అంబర హర్మ్యం
దాన్ని ఏ 'గోపురమూ' ఎక్కలేదు'
ఒక కాంతి వేగ సుదూర తీరం
దాన్ని ఏ 'చర్చీ' చూడలేదు'
ఒక అద్వైత లేఖనా చిత్రం
దాన్ని ఏ 'మసీదూ' విశ్లేషించలేదు'
వాదోపవాదాల వేద రహితం'
అధికారాలు అధిష్ఠించలేని
సుమసింహాసన సహితం'
అహంకారాలు భేదించలేని
స్వేచ్ఛాయుత సత్యవ్రతం'
నిర్వచనం 'ఇది' అని
చెప్పలేని ఆత్మీయత'
ప్రేమానురాగాలు పెనవేసుకున్న
ఆర్ద్రత'
దీని వెల "యింత' అని
నిర్ణయించలేని మానవత'
కులమత వైషమ్యాలు కాని
సౌహార్ద – సమత – మమత'
ఒక కాంతి లగ్నం – స్నేహం'
ఒక క్రాంతి నగ్నం – స్నేహం''
ఒక శాంతి యజ్ఞం – స్నేహం'''

—రాపోలు పరమేశ్వరరావు



# నకిలీ

ప్లాస్టిక్ పూలకు
పుష్ప విలాపం వర్తించదు!
గ్లిజరిన్ కళ్ళకు
కన్నీటి బాధ కన్పించదు!

– అడిగోపుల వెంకటరత్నమ్

# దిష్టి

గంగమ్మ చూపు
నిరంతరం
దున్నపోతుపై ఉన్నట్టే–
అత్త చూపు
అనుక్షణం
కోడలిపై కూడి ఉంటుంది.
అత్త దిష్టిబొమ్మ
మామ విరిగిన కొమ్మ
భర్త వాజమ్మ.
దున్నపోతు నెత్తురుతో
గంగమ్మ శాంతిస్తుంది
కోడలి కన్నీటితో
దిష్టిబొమ్మలకు ఉపశాంతి

–కాణిపాకం లింగన్న

# సంకరం

నాడు
మహాత్ములు నాటిన
స్వాతంత్ర్య బీజం.
మొలకెత్తింది!
కానీ...
నేడు –
విస్తరించిన
ఈ దేశ మహావృక్షం
స్వార్థంతో కూడిన హైబ్రిడ్
విత్తుల్నే
రాలుస్తోంది!

–గోలి గురుప్రసాదరావు

# యుగేయుగే!

పితాశ్రీ ప్రశ్నించాడు
పుత్ర రత్నాన్ని–
'ఇంకెన్నాళ్ళురా
రోడ్డు మీద గస్తీలు
మెట్రిక్యులేషన్‌తో
ముప్పయ్ సార్లు కుస్తీలు?'
అది విన్న సుపుత్రుడు
ఫిలాసఫికల్‌గా నవ్వి
అన్నాడిలా–
"మార్చాయ లిఖితం
సెప్టెంబరాయ పునఃలిఖితం
యూనివర్శిటీ పోషనార్థాయ
సంభవామి యుగేయుగే"

–జోగారావ్ గుండాన

వాళ్ళకు అదంతా ఆలోచించే ఓపిక వుండదు. తమను మనం నిర్లక్ష్యం చేశామనే అనుకుంటారు. అది సహజం. భాగ్యమ్మకు తన బంధువు లెవరిపైనా యే అభిమానమూ లేదు. ఆమెను యీ వయసులో కూడా యెవరూ తమతో వుంచుకుని చేయలేదని ఆమెకు చాల కోపం. కావలసినంత ఆస్తి వుండీ అసంతృప్తిగానే బ్రతికింది. తను బ్రతికుండగానే తను యిచ్చిన అప్పులన్నీ వడ్డీతో సహా వసూలు చేసింది. అందులో తనవాళ్ళూ, పరాయి వాళ్ళూ అని తేడా చూపలేదు ఇప్పుడు తన మొత్తం ఆస్తి మద్రాసులోని ఒక అనాథ శరణాలయానికి రాసేసింది"– ఏదో సామెత చెప్పినట్టు దాయాదులకి ఒక్క పైసా వుంచిందికాదు.

నిరంజన్ గ్రుడ్లప్పగించి చూస్తూ, వింటున్నాడు. అతని కళ్ళ ముందు అమ్ముడుపోయిన గొలుసూ, మామగారికి యివ్వాల్సిన వెయ్యి రూపాయలూ మెదల సాగాయి.

నిరంజన్ భార్య మతి పోయినట్టు చూడసాగింది.

## పెద్దమ్మ ఋణం

భార్య మొహం చూడ్డానికి కూడా భయపడ్డాడు నిరంజన్. వరదయ్యనే చూస్తున్నాడు.

"భాగ్యమ్మ మీ అమ్మకు యెప్పుడో వెయ్యి రూపాయలు అప్పుగా యిచ్చిందట. అది వడ్డీతో సహా యిప్పుడు రెండు వేల దాకా అయివుంటుంది. ఆ పత్రం చూపించి మీ దగ్గర నుండి ఆ అప్పు వసూలు చేయాలనీ, అదొక్కటే తనకు తిరిగి రాకుండా మిగిలి పోయిన అప్పనీ చాల సార్లు చెప్పి బాధపడింది. తను అప్పు యిచ్చిన వాళ్ళెవరినీ ఆమె వదల దలచుకోలేదు. అలాగే సాధించింది కూడా, ఒక్క మిమ్మల్ని తప్ప. తను చనిపోయేలోగా మీ నుండి కూడా వసూలు చేసేస్తానని చెప్పేది. కానీ, చనిపోయాక తన అంత్యక్రియలకు మీ చేత ఖర్చు పెట్టించి తన ఋణం వసూలు చేసుకుంది ఆమె ఆత్మ. మీరెలాగూ రెండువేల దాకా ఖర్చు పెట్టానంటున్నారు. మీకు దానిని తిరిగి యివ్వగలిగిన వాళ్ళెవరూ లేరు. ఆవిడ వీలునామాకు సంబంధించిన కాగితాలను మద్రాసులోని ఆ అనాథ శరణాలయాధికారులకు అప్పచెప్పి రావడానికే నేను యిన్నాళ్ళూ వెళ్ళింది. నా స్వంత పనులు కొన్ని చూచుకుని తిరిగి వచ్చేటప్పటికి ఆలస్యమైంది. ఇక యిక్కడ భాగ్యమ్మదంటూ ఒక పూచిక పుల్ల కూడా లేదు. ఈ యింటిని కూడా దీన్ని కొన్నవాడు వచ్చి యివాళో, రేపో స్వాధీనం చేసుకోబోతున్నాడు. కాబట్టి మీరూ యివాళే మీ వూరికి బయలు దేరడం మంచిది. మీరు వెళ్ళేముందు నాకు చెప్పారంటే, వచ్చి యింటికి తాళం వేస్తాను. ఇక సెలవు" అని చెప్పి వుత్తరీయాన్ని ఒకసారి దులిపి, పైన వేసుకుని బయలుదేరాడు వరదయ్య.

"పెద్దమ్మా! ఇంత ద్రోహం చేస్తావా!" అని నిజంగానే యేడ్చాడు నిరంజన్ యిప్పుడు. ●